ప్రేమికుడి నిర్వేదం

# నిన్నటి గులాబీలు

అడుసుమిల్లి భాస్కరరావు

గడచిన రోజులు గుర్తుకొచ్చినప్పుడల్లా ఈ నా మనోవేదన విపరీత మవుతూ ఉంటుంది. ఆ రోజులు మరపురానివి, వాటిని అంత ప్రభావంగా చెయ్యడానికి శశి కారణం. ఆవేదన భరించ శక్యంగాని ఘడియల్లో నాకు తెలీకుండా నేను 'శశీ! ఎంత అన్యాయం చేశావు నన్ను. నిన్ను నమ్మిన నాకింకేదిదారి? ఇక నాగతియింతేనా? ఈజీవిత కాలప్రవాహంలో ఈరీతిగానే కొట్టుకు పోవాల్సిందేనా?' అని అనుకునేవాణ్ణి. మరు క్షణంలో 'నే నపోహ పడ్డానా!' అని అని పించేది. శశి అమాయకురాలు. మొదట మా స్నేహం ఎంత ఆంతరంగికమైనా తలిదండ్రులకు ఎదురాడలేని అబల శశి. సాధు జీవితంపై ఆమె ప్రేమ, ఆమెను వారి చెప్పుచేతల్లో నడిపింది. దానికి కారకురాలు ఆమె కానప్పుడు ఆమెను అని ప్రయోజనం ఏమిటి?

ఇదంతా నాకర్మ. నాజీవితం సుఖానికి వ్రాసి పెట్టలేదు. నేనేం చేయగలను! భగవత్ప్రేరిత మైన ఈ కార్యకలాపాలకు ఎవ్వరు నిందితులు కారు - అని వేదాంత ప్రవాహంలో కొట్టుకు పోతూండేవాడిని.

శశీ! నీ విషయం తలచడానికి హృదయం కొట్టుకునేది. నీవొక సహధర్మచారిణి వయ్యావు. అంతేగాక నీజీవిత కుసుమం నీకు జన్మించింది. నీ సౌఖ్యపు జీవితానికి నా అభినందనలు గాలి తెరలద్వారా పంపుతూండే వాడిని. ప్రస్తుతానికి ఎప్పటికి, అదే నా జీవితాశగా కాలం గడుపు కుంటున్నా.

ఆలోచనల మధ్యలో ఒక తృప్తి జనించేది. మనిద్దరి జీవితాలు భగ్నం గాకుండా, నీవైనా కొద్ది ఆనందాన్ని అనుభవిస్తున్నావని. నీఆనందం నీ పుత్రుడి రూపం పొందింది... వెంటనే నా లోని ఆవేదనా తెరలు విరజిమ్ముకునేవి - నా జీవితం పాడయిందని, దానికి నీవు కారణం అని సుఖం - అనే పదానికి అర్థం చెప్పగా వినడం గాని అనుభవించి చూడటం కుదరలేదింతవరకు. మన ఆ చిన్ననాటి ఆనందం నాకు జ్ఞప్తికి వచ్చి నప్పుడల్లా నాలో తీరని బాధ జనించేది. అట్టి దినాలు తిరిగిరావనుకున్నప్పుడల్లా హృదయంలో జనించే బాధను అదుముకోలేక ఇక జీవించ కూడదు - అనే నిర్ణయానికి వచ్చేవాడిని.

నా జీవితంలో విషాదపూరితమైన ఘట్టం అది- ఆరోజున నీకు గోపితో వివాహం జరిగేరోజు-నా పరీక్షాఫలితం తెలిసిన రోజు - రెండూ ఒకేమారు వాటిల్లడం-నా జీవితం అంతా ఏజీవిపై ఆధారపడి ఉందో-ఆ నీవు నాకు దూరమవడం భరింపరాని దయింది. నన్ను నేను నిందించుకున్నాను. నాభావి జీవితం ఎలా గడుస్తుందా అనే వ్యథ నాలో జనించింది. జీవితంపై రోత జనించింది. ఇక జీవించలేననే నిర్ధారణకి వచ్చాను. కాని కాల గతి నన్నిలా దుఃఖజీవిగా ఈడ్చేస్తోంది. ఎన్ని మార్లో మరుసటి దినానికి భౌతికదేహం ఉండ దనుకున్నప్పటికీ- ఈజీవితం కొరకరాని కొయ్యగా, అంతం లేనిదిగా మారింది. చివరికి నీ సౌఖ్యం చూడటానికి ఉన్నా ననుకున్నా...ఆ రోజు తరువాత నే నింట్లో నిలవలేక పోయాను. గమ్య స్థానం లేకుండా బయలుదేరి పోయాను ఎక్క డెక్కడ ఆగానో, ఏమేం చేశానో తెలీకుండా ప్రస్తుతం ఇలా ఉన్నా.

ప్రతినిత్యం ఏదో సమయంలో కలం కాగి తంతో బయలు దేరేవాణ్ణి. 'శశికి' అని కాగితం పై వ్రాయగానే నా చేతులు నా ఆధీనంలో లేకుండా వణక సాగేవి. ఆ స్థితిలో -కలం- తెల్ల ముఖం వెయ్యడం-హృదయంలో ఏదో పట్టి పీకు తున్నట్లు అనిపించడంతో సంకల్పం మానుకునే వాడిని. ఏమో! నే వ్రాసే ఉత్తరం ఎలా ఉంటుందో! గోపి అది చూచి ఏమనుకుంటాడో! నేను నీకు అన్యాయం చేసినవాడి నౌతానేమో!

అని భయపడేవాడిని. ఆ నా భయం నిజంగా నిరూపించావు నీ ఉత్తరం ద్వారా!

అప్పుడప్పుడు కిష్టుడు నా దగ్గరికొచ్చి నీ విషయాలు చెప్పుతూండేవాడు. నీవు నా విషయం తలచుకొని బాధ పడ్తూంటావని కూడా చెప్పేవాడు. ఆ విషయం ప్రస్తావించినపుడు నా హృదయం తరుక్కుపొయ్యేది.

నీ సౌఖ్యం అన్నివిధాలా చక్కబెడ్తున్నాడని నీవు వ్రాశావు. చాలా సంతోషించాను. గోపి నీ భర్తగా ఎంతో సౌఖ్యపడతాడు. అది అతని అదృష్టం. నీవు, నీ భర్త అన్నివిధాలా కులాసాగా ఉండటం నే కోరేది. దానికోసరం భగవంతునికూడా ప్రార్థిస్తాను

ఇంతవరకూ నీవు వ్రాసిన భాగం నన్ను ఎంత ఆనందపరచిందో, నా కథలు చూచి నీవు వ్రాసిన భాగం నన్ను అంత కష్టపరచింది. నేను ఒక మాట అన్నతర్వాత జన్మ జన్మాంతరాలు దానిని అనుసరిస్తాను. నేను ఈ జీవితంలో ఒకరిని మాత్రమే మనసారా ప్రేమించాను. ఆ ఒక్కరూ నాకు దూరమయ్యారు. ఆమెను నే నింకా ప్రేమిస్తున్నాను. ప్రేమిస్తాను. నా ఈ ప్రేమ తుచ్ఛమైనది గాదు. పవిత్రమైన ప్రేమ. వివాహమను అనుబంధానంతరము ఆమెను నేను నా ఏకైక సోదరిగా ప్రేమిస్తున్నాను. పూర్వపు ప్రేమ ఏవిధమైనదో నేను మరచి చాలా కాలమైనది. ఇప్పటి నా ప్రేమలో శశి ఎన్నటికిని పవిత్రారాధితమూర్తి ఆమె సుఖమే నా సుఖము, దుఃఖమె నా దుఃఖము, నేను ఇప్పటికే గాదు ఎప్పటికైనను అవివాహితుడనే. ఎందుకనగా, నా యుద్దేశ్య ప్రకారము ఈ నా కష్టకూటములో ఇంకొక జీవిని తీసికొనివచ్చి కష్టపెట్టుట చాలా అన్యాయము ఈవిధంగా ఉండటం ఎవరివల్లాగాదు. నావల్లమాత్రమే! ఎందుకనగా నేను వివాహితుడుగా ఉండదలచక పోబట్టి. నీవు ఇప్పుడు ఒకతల్లివని, వివాహితవని నాకు తెలిసినప్పుడు నీకోసము నేను బాధపడుతున్నాననుట అన్యాయమని నా యుద్దేశ్యము.

నే పెండ్లి చేసుకోకుండా ఉంటే నీవల్ల పిచ్చివాడనయ్యానని అంటారని నీవు వ్రాశావు. నా పెండ్లి నాయిచ్ఛమీద ఆధారపడి ఉంది. నీకోసం నేనేమీ పరితపించను-అందువల్ల పిచ్చివాడనూ గాబోను. నన్ను పెండ్లిచేసుకోమని నీవు వ్రాయడం నన్ను బాధించడం.

నా కథలను చూచి నీవు వ్రాయడంలో కొంపరపడ్డావని నే అనుకుంటున్నాను. వివాహిత స్త్రీగా నీవు పొందే సౌఖ్యం నీవే ఈలా వ్రాసుకున్నావు: "నా సుఖానికి ఎప్పుడూ అవాంతరం కలగలేదు. సమగ్రంగా జీవించేందుకు కావలసిన పరిస్థితులు గోపి కల్పించాడు. నేను గోపిని భర్తగా ప్రేమించిన మాట వాస్తవమే. అతని చూపులు నాలో జ్యోతులు వెలిగిస్తాయి." ఈ విషయాలు నీవు నాకిలా వ్రాయటం ఆశ్చర్యకరం. నన్ను, నా గడచిన రోజులను మథ్యపెడ్తాయి ఈ వాక్యాలు. ఇంతకీ నేను నీవు సౌఖ్యపడ్తున్నావని వ్రాయడం ఏమాత్రం తప్పుగాదు. బాధపడుతున్న నేను నా విషయం తల్చుకుంటే క్రుంగిపోతాను. అట్టి పరిస్థితులలో మన పూర్వ జీవితాలు, ప్రస్తుత జీవితాలు తలుచుకొన్నప్పుడు ఎంతగా నన్ను బాధపెడ్తాయో ఎప్పుడైనా ఆలోచించావా? నీకు జ్ఞప్తికొచ్చిన మాటలు ఏమాత్రం సందర్భానికి అనుగుణంగా లేవని నాకు తోస్తోంది.

సానుభూతితో ఆలోచించకపోతే ప్రపంచంలో ఏదీ సరిగా అర్థంగాదు. నాకు చెప్పిన ఈ మాటలు నీ విషయంలో నీవు ఆలోచించుకొన్నావా? ఆ దృష్టితో చూడకపోతే ఏ విషయం అర్థంగాదు. కాని నీవు వ్రాసినట్లుగా కాదు. అర్థమయిన విషయాలు ఎన్నటికి అర్థమైనట్లే. నన్ను నేను నా ప్రియసోదరిగా భావిస్తున్నప్పుడు వైరుధ్యమనే తెరకు స్థలం లేదు-మనమధ్య.

ఏ విషయాన్నయినా మానవుడు రెండు విధాలుగా పరిగణిస్తాడు - మంచి, చెడ్డ-రెండో విధంగా నీ, నా పరిస్థితులు చూస్తే నీవు నన్ను మోసగించిన మాట వాస్తవమే. చిన్ననాటి నుండి, అతి అనురాగంతో మెలగుతూ, మనం కలసి ఉన్న రోజులన్నీ ప్రేమతో గడిపి, చివరికి నన్నీ విధంగా నీవు చేశావంటే - దాని అర్థం ఏమిటి?- నీవు నన్ను మోసం చేశావన్నమాట. కాని ఆ విధంగా నేను నిన్ను పరిగణించను. అది నా ఉద్దేశ్యంగాదు.

నాకు జరిగినది-జరగబోయ్యేది అనేవి లేవు. నేను నన్నుగా భావించినపుడు అంతా ఒక్కటే నాకు. జరగబోయ్యేది నీవు ఆలోచించుకోవాల్సి ఉంది. "ఎంతకాల మిలా తన చేతి కందని వస్తువును కోర్చి ప్రాకులాడటం? ఇలా చాలా మంది చేశారు. అదే నీవూ చేస్తున్నది." ఈ మాటలు నన్ను చాలా బాధించినాయి. ఇది నీవురాసిన ఉత్తరమేనా అనే అనుమానం నాకు కల్గుతోంది. నీవు నన్ను సామాన్యుడిగా అర్థం చేసుకున్నావు. నాలో నిబిడీకృతమైన సౌమ్యత నిన్నిలా అనేట్టు చేసింది. ఎన్నడు నీకు గోపి భర్త అయ్యాడో ఆరోజునుంచే నీవు నాకు సోదరిగా పరిగణిస్తున్నాను. నీకోసం నేను ప్రాకులాడటం ఎన్నటికి జరగని పని. నీలోని ఆ ఉద్దేశ్యమును మార్చుకో వలసిందిగా కోర్తున్నాను.

నా వివాహం గూర్చి నీవు వ్రాసేది జరగని సంగతి. ఎప్పుడూ అట్టి కలలుగని నీవు నాకా విధంగా వ్రాయవద్దు. నీవు ఈ ఉత్తరం వ్రాసిన విధంగా నాకు జాబు వ్రాసిన నన్ను కష్టపెట్టిన దానివౌతావు. "నీవు హృదయ పూర్వకంగా, సహృదయంతో నన్ను పిలిచావంటే" అని నీవు వ్రాశావు. నేను నిస్సత్రుడైనా పిలవవలసి వస్తే హృదయ పూర్వకంగానే పిలుస్తా. సహృదయంతో అని నీవు వ్రాయడంలో ఉద్దేశ్యం-? ఏదైనా నా హృదయం ఎల్లప్పుడూ సహృదయమే. నీవు వ్రాసిన ఉత్తరంద్వారా నన్నో నీచహృదయుడుగా తేల్చావు. కొన్నివిధాల నేను నీ కష్టానికి కారణంగా ఉంటానని భయపడ్డావు. వీటన్నిటికి కారణం నేను ఈ ప్రపంచంపై ఉండటమే. దీనికి మందు నే వేస్తా - అప్పుడు ప్రపంచం తెలుసుకుంటుంది ప్రేమతత్వం మీద గడచిన రోజుల ప్రభావం...

నా యీ లేఖ యీ విధంగా పూర్తి గావడం నాకలాని కిష్టంలేదుట.

నీ పసిపాప నీకు చాలా ఆనందం కూర్చుతున్నాడని వినడానికి చాలా సంతోషించాను. భావి జీవితంలో గూడా నీ ఆనందానికి మేర ఉండరాదని భగవంతుని నే కోరుతున్నాను ఈ విధంగా జరిగినపుడు నాస్థితి గురుతుకొచ్చేది... కాని ఇప్పుడా విషయం ప్రస్తావించను.

నా యీ గడచినరోజులు నే మరువలేను. అట్టి ప్రయత్నం చేయను. అవి నాకు మధుర స్మృతులు... వాటిని నేను మరువడం నామరణానంతరం


శుభ్రమైన చలువ....



కాలుకుదిరి ఒక గంటసేపు కూర్చున్నాడంటే ఒక్క పాకెట్ ప్లేయర్స్ సహాయంతో అటువంటి ఉపన్యాసాలు తొంభై రాస్తాడు ఈ చిన్న విషయంలో శర్మసహాయం తీసుకుంటేనేం? ఈమాత్రం సహాయం చెయ్యలేడా స్నేహితుడన్న తర్వాత? ఉన్న కష్టమల్లా శర్మను గదికి లాక్కుపోవడంలోనే! విషయమంతా శర్మకు చెప్పేసి రూముకు రమ్మని పిలిచాడు. రామారావు అదృష్టమేమోగాని శర్మ 'సరే పద' అన్నాడు. రామారావు ఎగిరి గంతేసి రెండు పేకెట్లు ప్లేయర్స్ ఒక అగ్గిపెట్టె కొనేసి శర్మతోసహా రూములో చేరిపోయాడు. డిక్షనరీ దగ్గర పెట్టుకొని మంచిమంచి పదాలు ఉపయోగిస్తూ, ప్లేయర్స్ వూదేస్తూ శర్మ అరగంటలో ఉపన్యాసాన్ని తయారుచేసాడు. పూర్తయిన తర్వాత ఒకసారి అంతా చదివేసి అమోఘంగా ఉందనుకొన్నాడు రామారావు. శర్మకు మంచి విందిప్పించి, ఒక పేకెటు సిగరెట్లు కొనిచ్చి, అతణ్ణి సాగనంపి ఆ ఉపన్యాసాన్ని బట్టీ పెట్టడంలో మునిగిపోయాడు రామారావు. ఆ రెండురోజుల్లో పదానికి పదం వాక్యానికి వాక్యం అనర్గళంగా వొప్పజెప్ప గలిగాడు. గట్టినమ్మకంతో బొంబాయికి బయలు దేరాడు.

ఆ సాయంత్రానికి బొంబాయి రాయల్ హోటలులో తనకుగాను ప్రత్యేకించబడిన గదిలో చేరుకున్నాడు రామారావు. స్నానం వగయిరాలు ముగించుకొని, మళ్ళీ నాలుగుసార్లు ఉపన్యాసాన్ని చదువుకొని కాఫీ తాగివస్తానని కిందవున్న రెస్టారెంటులోకి పోయాడు. రెస్టారెంటులో ఒక్కడే ఒకటేబులు దగ్గర కూచొని కాఫీ తాగుతున్నాడు. అవతల టేబులు దగ్గర కూచుని ఉన్న వ్యక్తి అదేపనిగా తన్ను చూస్తున్నట్టు గమనించేడు. కొంచం సేపటికంతా ఆ వ్యక్తి లేచి తనవైపే వచ్చాడు. రామారావు కూచోమన్నట్టు కుర్చీ చూపెట్టేడు.

పక్కనున్న కుర్చీలో కూచొని ఎంతో చిరపరిచితుడు లాగ మొదలు పెట్టాడు ఆ వ్యక్తి. "నేనీ వూరు రావడం ఇదే మొదటిసారండి. అంతా కొత్తవాళ్లు! రేపొక్కరోజే ఇక్కడుండి పోతాను, నా పేరు చంద్రశేఖరన్" అన్నాడు రామారావుతో.

"నేనూ కొత్తవాడినే. మీరేం పనిమీద వచ్చారేమిటి?" కొంచెం సంతోషంతోనే అడిగాడు.

"ఆఁ, ఇక్కడోహ ఇంటర్‌వ్యూ తగలడ్డది! ఆ రావ్ అండ్ కో వాళ్ళ సేల్సు మేనేజరు పోస్టుకు ఇంటర్‌వ్యూకు రమ్మన్నారు లెండి" అన్నాడు చప్పరిస్తూ.

రామారావు ఒక్కసారి నవ్వి "ఐతే నేనూ ఆదే పనిమీద వచ్చినవాణ్ణే!" అన్నాడు.

"అవును. మిమ్మల్ని చూట్టంతోనే అనుకొన్నాను మీరే నా ప్రత్యర్థి అయివుంటారని. ఊరుగాని వూళ్లో ఒంటరిగా ఉండటం మహా కష్టమండీ" అన్నాడు చంద్రశేఖరన్. ఇద్దరు షేక్‌హేండ్సు ఇచ్చుకొన్నారు. మరుక్షణం స్నేహితులయ్యారు. బొంబాయినిగురించి, రావ్ అండ్ కంపెనీని గురించి మాట్లాడుకొన్నారు. తాము మరుదినం చెప్పబొయ్యే ఉపన్యాసాలను గురించి ముచ్చటించుకొన్నారు. చంద్రశేఖరన్ ఇలా అన్నాడు. "సరేగాని, ఇద్దరము ఒకరి ఉపన్యాసం ఒకర మెందుకు చదవకూడదు? అలా చేస్తే ఇద్దరికీ లాభ ముంటుంది."

కాదంటే బాగుండదనీ, పైగా అవతల వాడి ఉపన్యాసం చదివితే తన జయాపజయాలు తెలుసుకో వచ్చుననీ రామారావు సరేనని తన ఉపన్యాసపు రాతప్రతిని చంద్రశేఖరన్‌కు అందిచ్చాడు. చంద్రశేఖరన్ కూడ తాను రాసుకొచ్చినదాన్ని రామారావు కిచ్చాడు. ఇద్దరూ చదవడం మొదలు పెట్టేరు.

చంద్రశేఖరన్ ఉపన్యాసం రామారావు కంత గొప్పగా కనిపించలేదు. మధ్యరకంగా ఉంది. తన వుపన్యాసం ముందు దిగదుడిచేందుకు గూడ పనికిరాదనిపించింది. చంద్రశేఖరన్ కొంచెంసేపు చదివాడు. "అబ్బ! ఏమి గలభా? ఈ గోలంతా చదివితే ఏమి అర్థమవుతుంది? ఏమండి, మీ రేమనుకోరు గదా, రూముకెళ్ళి చదివి పట్టుకొస్తాను" అన్నాడు చంద్రశేఖరన్. "అలాగే, నిరభ్యంతరంగా చదువుకోండి" అన్నాడు రామారావు తనకు విజయం తప్పదన్న ఉత్సాహంతో. చంద్రశేఖరన్ రూములో తన ఉపన్యాసాన్ని షార్ట్‌హేండ్‌లో కాపీ చేస్తాడని రామారావెలా ఊహిస్తాడు?